

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

సోమవారం 10 ఫిబ్రవరి 2025 పేజీలు : 04


# వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం సమంజసం

**- సంఘం సభ్యులతో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు**

**అనంతపురం, ఫిబ్రవరి 9, ప్రభాత వార్త బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ లోని వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితా లో చేర్చాలనే అంశంపై వాల్మీకి, బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కుల శ్రీనివాసులు, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.సి. అక్కులప్పలు అనంతపురం లోని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్వగృహంలో ఆదివారం కలిశారు. ఎస్టీల్లో చేర్చాల్సిన ఆవశ్యకత పై సుదీర్ఘంగా చర్చించారు. 2017 డిసెంబర్ రెండవ తారీఖున అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర క్యాబినెట్ ఎస్టీ ల్లో చేర్చాలనే అంశంపై చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు. శాసనసభ ఆమోదంతో కేంద్రానికి, రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా వారికి ప్రత్యేక నివేదిక పంపడం జరిగిందని తెలియచేశారు. అనంతరం



కాలవతో మాట్లాడుతున్న ఉద్యోగసంఘాలు

కేంద్రం నుండి వాల్మీకి బోయ ఎస్టీ పునరుద్ధరణ అంశం పై కొన్ని ప్రశ్నలు వేసి నివేదిక పంపాలని రాష్ట్రాన్ని కోరడం జరిగిందని వివరించారు. ఆ ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు త్వరితగతిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి రిజిస్టర్ ఆఫ్ జనరల్ ఇండియా వారికి పంపాలని, అలాగే ఆ ప్రశ్నలకు సంబంధించిన ఏ విధంగా సమాధానం ఇవ్వాలి అనే అంశం మీద జీవోలతో కూడినటువంటి సమాచారాన్ని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు అందజేయడం జరిగింది. దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఈ అంశంపై తనవంతు బాధ్యత తప్పక నిర్వర్తిస్తానని సంఘం సభ్యులకు కాలవ భరోసా ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రస్తుతం చంద్రబాబు ఉన్నందున సమస్యకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఏపీ విబిఎస్ అధ్యక్షులు మాధవయ్య ఏపీ వి బి ఎస్ రాష్ట్ర కార్యదర్శి కేశవులు భాగ్యరాజు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఏపీ వి బి ఎస్ అధ్యక్షులు గౌరీశ్వర్ నాయుడు చిత్తూరు జిల్లా నాయకులు మహేష్ , ఈశ్వరుడు, లోకేష్, వాల్మీకి యువత పాల్గొన్నారు.

# జనసంద్రమైన అశ్వత్థ క్షేత్రం



శ్రీఅశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

**పెద్దపప్పూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన అశ్వత్థక్షేత్రం జనసంద్రమైంది. మాఘమాసం రెండవ ఆదివారం సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీఅశ్వత్థనారాయణ స్వామి, శ్రీచక్రభీమలిం గేశ్వరస్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్నానఘట్టాలతో పాటు పెన్నానదిలో మాఘస్నానాలు ఆచరించి ఆలయం ఆవరణలో స్వామివారి నైవేద్యం వండి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, చలువ పందిళ్లు, ప్రత్యేక తాగునీటి వసతి ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ఇఒ సుబ్రమణ్యం, సిబ్బంది గుర్రప్ప, అరుణ్, కాశీ, నిర్వాహకులు చంద్ర మోహన్‌రెడ్డి, వెన్నపూస మల్లికార్జున రెడ్డి, వాసు, శ్రీనివాస్‌రెడ్డి, రామాం జుల్‌రెడ్డి, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి ని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తాడిపత్రి ఆర్టీసి అధికారులు తిరుణాలకు వచ్చే భక్తుల సౌక ర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు. పలువురు స్వచ్ఛంధ సంస్థల వారు భక్తులకు తాగునీరు, అన్నదాన కార్యక్ర మాలను విరివిగా చేపట్టారు. ఆలయం ఆవరణలో గాజుల అంగళ్లు, దేవతామూర్తుల ఫోటోల అంగళ్లు, మిఠాయి దుకా ణాలు, చెరుకు అంగళ్లు, జెయింట్‌వీల్, తదితరవి భక్తులతో కిక్కిరిసి పోయాయి. తిరుణాలలో ఎలాంటి అవాంచనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



శ్రీ చక్రభీమలింగేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం

# సామాజిక కార్యచరణ కలిగిన వ్యక్తి జూపల్లి ప్రేమ్‌చంద్

**- పుస్తక ఆవిష్కరణ సభలో పలువురు వక్తలు వెల్లడి**





పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

**అనంతపురం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త బ్యూరో**

జూపల్లి ప్రేమ్ చంద్, దళిత బహుజన వాదాల దృక్పథంతో పనిచేసిన సామాజిక వ్యక్తి అని, ఆవేద, నిచ్చెనమెట్ల లోలకం తదితర గ్రంథాల ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేసుకున్న జూపల్లి ప్రంచంద్ ఆధునిక దృక్పథం కలిగిన వ్యక్తి అని వక్తలు కొనియాడారు.

ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవో హోం అనంతపురంలో, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో, డాక్టర్ జూపల్లి ప్రేమ్ చంద్ రచించిన "ఆధునిక తెలుగు వచన కవిత్వం విభిన్న ధోరణులు ". పుస్తకాన్ని జిల్లా అధ్యక్షుడు బి ఈశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించడం జరిగింది. ముఖ్య అతిథి గా హాజరైన బండి నారాయణస్వామి ప్రసంగిస్తూ, చైతన్యవంతమైన సాహిత్యాన్ని తెలుగు సాహిత్యానికి అందించిన రచయితని కొనియాడారు. సభ కు గౌరవ అతిథిగా హాజరైన జంగా గౌతమ్ ప్రసంగిస్తూ, గొప్ప సృజనాత్మక రచయిత ప్రేమచంద్ అని, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తి అని ప్రసంగించారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన తూముచర్ల రాజారామ్ ప్రసంగిస్తూ ఆధునిక తెలుగు కవిత్వంలో వచ్చిన ధోరణులను నిశితంగా పరిశీలించి భావితరాలకు గొప్ప సిద్ధాంత గ్రంధాన్ని జూపల్లి అందించారని . ఆధునికత అంటే జీవన విధానం మరియు సామాజిక తాత్వికత అనే కొత్త సూత్రాన్ని జూపల్లి ప్రేమ్ చంద్ ఆవిష్కరించారు అని కొనియాడారు. ఉప్పరపాటి వెంకటేశులు డాక్టర్ నానీల నాగేంద్ర, తదితరులు ప్రసంగించారు. పుస్తకాన్ని జూపల్లి ప్రేమ్ చంద్ సతీమణి జూపల్లి రాజేశ్వరి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రేమచంద్ కుటుంబ సభ్యులు, జూపల్లి పిల్లలు జూపల్లి శంతన్ కుమార్తె డాక్టర్ జూపల్లి అపర్ణ, హెచ్ నాగ లింగయ్య ,డాక్టర్ గేయానంద్, డాక్టర్ ప్రసూన, చెట్ల ఈరన్న, అమరనాథ్ రెడ్డి, డాక్టర్ నానీల నాగేంద్ర, తన్నీరు నాగేంద్ర, నిర్మలా రాణి ,కంబదూర్ షేక్ నబి రసూల్, ఏ ఓబుళపతి, దాసన్న గారి కృష్ణమూర్తి, కాంగ్రెస్ నాయకులు శంకర్, బంగి సుదర్శన్, శ్రీరాములు, షేక్ రియాజుద్దీన్ డాక్టర్ జూటూర్ షరీఫ్, మధుర శ్రీ, నిమ్మల వరప్రసాద్ తదితరులు హాజరై సభను విజయవంతం చేశారు.

## ఆన్‌లైన్ బెట్టింగులు, జూదాలకు

# బానిసలవుతున్న యువత..!

- టీ స్టాళ్లలో ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగుతున్న ఆన్‌లైన్ జూదాలు
- కొందరు యువత వ్యసనాలతో విసుగెత్తిపోతున్న టీ స్టాళ్ల నిర్వాహకులు
- పట్టణ బైపాస్‌లోని ఏ టీ స్టాల్‌లో చూసినా గుంపులు గుంపులుగా యువత
- అప్పులు చేసి బెట్టింగులు, జూదాలు ఆడి వేలు, లక్షలు నష్టపోతున్న వైనం
- కొన్ని టీ స్టాళ్లలో యధేచ్ఛగా ఆర్థిక లావాదేవీలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు
- అవాంఛనీయ ఘటనలు జరుగకముందే పోలీసులు స్పందించాలంటున్న స్థానికులు



**ఉరవకొండ, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ఆన్‌లైన్ బెట్టింగులు, జూదాలకు యువత బానిసలవుతోంది. నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని, అనంతపురం-బళ్లారి 42 నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పలు టీ స్టాళ్లు బెట్టింగులు, ఆన్‌లైన్ జూదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ టీ స్టాళ్లలో సూర్యోదయం మొదలు రాత్రి బాగా పొద్దుపోయే వరకు ముఖ్యంగా కొందరు యువత ఇక్కడ మకాంవేసి సెల్ ఫోన్ల ద్వారా ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చిన ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులు, రమ్మీ, ఇతరత్రా జూదాలు, ఇతరత్రా ఆటలు ఆడుతూ విలువైన సమయాన్ని, డబ్బును వృధా చేసుకొంటున్నారు. టీ స్టాళ్లలో 5 నుంచి 10 మంది వరకు కూర్చొనేందుకు వీలుగా ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయబడి ఉండటంతో జూదాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. టీ స్టాల్‌లోకి రాగానే ఒక టీ తాగడం అక్కడే గంటల తరబడి కూర్చొని ఆన్‌లైన్ జూదాల్లో మునిగి తేలడం ఇక్కడ పరిపాటిగా మారుతోంది. టీ స్టాళ్ల నిర్వాహకులకు అన్నీ తెలిసినా ఎవరినీ ఏమీ అనలేక, వ్యాపారం పోగొట్టుకోలేక పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలు, భూముల క్రయ విక్రయాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, పంచాయతీలకు కూడా టీ స్టాళ్లే అడ్డాగా మారుతున్నాయి. ప్రధానంగా పనీపాట లేనివారు, లక్షాధికారులు, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు టీ స్టాళ్లలో గుమిగుడటం బెట్టింగులు, జూదాలతో ఇక్కడ కాలక్షేపం చేయడం నిత్యకృత్యమవుతోంది. కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో కొన్ని చైనా యాప్‌లను నిషేదించినా ఇటీవలి కాలంలో వాటికే పేర్లు మార్చి, మరికొన్ని యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగు, రమ్మీ, ఇతరత్రా జూదాల యాప్‌లు అందుబాటులోకి రావడంతో యువత వాటికి బానిసలై ఇంట్లో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియకుండా వేలు, లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఆడటం, డబ్బులు పోగొట్టుకోవడం జరుగుతూ వస్తోంది. స్నేహితులందరూ కలిసి ఒక ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి లక్షలాది రూపాయలు కోల్పోయి గొడవపడి చివరికి పట్టణానికి చెందిన కిషోర్ కుమార్ అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇందుకు ఆన్‌లైన్ బెట్టింగులు, జూదాలు యువతపై ఏ మేరకు ప్రభావం చూపుతున్నాయో స్పష్టం చేస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగులు, జూదాల కారణంగా టీ స్టాళ్లవద్ద శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం అయ్యే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పోలీసులు ఇప్పటికైనా స్పందించి టీ స్టాళ్లలో గుంపులు, గుంపులుగా గంటల తరబడి ఎవరూ కూర్చోకుండా చర్యలు తీసుకొనగలిగితే కొంత వరకైనా యువత పెడదారి పట్టకుండా నివారించవచ్చని పరిశీలకులు చెబుతున్నారు.



# రూ.90 లక్షల బంగారు, వజ్రాభరణాలు, నగదు స్వాధీనం

**- పేరుమోసిన మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన అనంత పోలీసులు**

**- అనంతపురం శ్రీనగర్ శివారు కాలనీలో 18 రోజుల క్రితం జరిగిన చోరీ కేసు ఛేదింపు - ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పి జగదీష్**



స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం చూపుతున్న జిల్లా ఎస్పి జగదీష్ ,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పి

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

అనంతపురం శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని 3 విల్లాస్‌లో జరిగిన చోరీ కేసులను అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పి జగదీష్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా వున్న మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ధార్ గ్యాంగ్‌కు చెందిన నారు పచావర్ (చడ్‌వాడ్ గ్రామం, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్), సావన్ (శాంతియ దుద్వే, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్), సునీల్ (పిపాల్దిల్యా గ్రామం, ధార్ జిల్లా, మధ్యప్రదేశ్) ముగ్గురిని అరెస్ట్ చేయగా మధ్యప్రదేశ్‌కే చెందిన మహబత్, మోట్లలు పరారీలో వున్నారన్నారు. ఈ గ్యాంగ్‌లో మోస్టువాంటెడ్‌గా వున్న ప్రస్తుతం అరెస్ట్ అయిన వారిలో గ్యాంగ్‌లీడర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 32 కేసులు నమోదు అయినట్లు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల నుండి 90 లక్షల రూపాయల విలువ చేసే 59 తులాల బంగారు వస్తువులు, వజ్రాలు పొదిగిన ఆభరణాలు, 19.35 లక్షల రూపాయల నగదు, 3 ద్విచక్రవాహనాలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత 22వతేదీన స్థానిక శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడు ఇళ్లల్లో చోరీలు జరిగాయని ఇళ్లకు తాళం వేయడంతో ఎవరూ లేని సమయంలో చొరబడి దాదాపు 2.13 కోట్ల విలువ చేసే బంగారు వస్తువులు, వజ్రాభరణాలు, నగదు ఎత్తుకెళ్లారన్న ఫిర్యాదు మేరకు స్థానిక 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

**సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పి - రంగంలోకి 4 ప్రత్యేక పోలీసు బృందాలు :**

ఈ చోరీలను జిల్లా ఎస్పి జగదీష్ సీరియస్‌గా తీసుకుని చోరీలు జరిగిన ఇళ్లల్లో క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లను పంపి ఆధారాలు సేకరించామన్నారు. జిల్లా ఎస్పి, అనంతపురం అర్బన్ డిఎస్‌పిలతో పాటు సిసిఎస్ పోలీసులు చోరీ జరిగిన ఇళ్లను సందర్శించి జరిగిన తీరుపై ఆరా తీశారన్నారు. అంతేకాకుండా ఈ చోరీ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించేందుకు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

**తాళం వేసిన ఇళ్లే టార్గెట్ - పగలు రెక్కీ..రాత్రి చోరీ :**

అనంతపురం నగరంలోని శ్రీనగర్‌కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్‌హోంలో తాళం వేసిన ఇళ్లపై రెక్కీ చేశారని ఆ విల్లాస్‌లో వున్న శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్‌నాయుడు ఇళ్లను టార్గెట్ చేసుకున్నారని నిందితులైన నారు పచావర్, సావన్, మహబత్, మోట్లలు గత నెల 22వతేదీ తెల్లవారుజామున ఆ మూడిళ్లకు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారని ఆ ఇళ్లల్లో వున్న విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు దోచుకెళ్లారన్నారు. వాటిని అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందని జిల్లా ఎస్పి తెలిపారు. వెంటనే అనంతపురం అర్బన్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి ఆదివారం స్థానిక రాయల్‌నగర్ సమీపంలో అరెస్ట్ చేశారన్నారు. అందరూ పాతనేరస్తులేనని పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం అరెస్ట్ అయిన ముగ్గురు పరారీలో వున్న ఇద్దరు కూడా పాతనేరస్తులేనని ఈ ఐదుగిరిలో పచావర్, మహబత్‌లు ముఖ్యులన్నారు. వీరిపై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో దాదాపు 32 కేసులు వున్నాయని, మహబత్‌పై కూడా నాలుగు రాష్ట్రాల్లో దాదాపు 29కిపైగా కేసులు వున్నాయన్నారు. సావన్, సునీల్, మోట్లపై కూడా కేసులు వున్నాయన్నారు. వీరు అంతర్‌రాష్ట్ర దొంగలని పరారీలో వున్న గ్యాంగ్ సభ్యుల కోసం గాలింపు ప్రక్రియ కొనసాగుతోందని ఎస్పి పేర్కొన్నారు.

**శ్రమించిన పోలీసు బృందాలకు ప్రశంసాపత్రాలను అందచేసి ఎస్పి :**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా వుంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన అనంతపురం అర్బన్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్‌కుమార్, జయపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు రాంప్రసాద్, రాజశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సిబ్బందికి జిల్లా ఎస్పి జగదీష్ ప్రశంసాపత్రాలను అందచేశారు.

# సచివాలయంలో అందుబాటులో లేని ఉద్యోగులు

**- పనుల కోసం వస్తున్న ప్రజలు - అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్న ప్రజలు**

**అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతి పనికి అధికారులు అందుబాటులో వుండాలని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అనంతపురం అర్బన్ పరిధిలోని రాజీవ్‌కాలనీ పంచాయతీలోని సచివాలయాల్లో ఉద్యోగులు పనివేళల్లో అందుబాటులో లేకుండా ప్రజలను ఇక్కట్లకు గురి చేస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలు వచ్చిన సమయంలో రాజీవ్‌కాలనీ-2 పరిధి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు విధుల నిమిత్తం వెళ్లి 6 నెలలు దాటినప్పటికీ తిరిగి యధా స్థానానికి రాకుండా అక్కడే కాలక్షేపం చేస్తూ ప్రజలకు అందుబాటులో లేకుండా వున్నారు. అదేవిధంగా రాజీవ్‌కాలనీ-1 సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ కూడా ఆర్డీఓ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. అయితే వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేరని తెలుసుకుని నిట్టూరుస్తూ వెళుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగులు ఎవరూ సచివాలయంలో లేకపోవడంతో ప్రజలకు సమాచారం ఇచ్చే వారే లేరు. అక్కడ పనిచేస్తుననన కార్యదర్శి రాజీవ్‌కాలనీ అనంతపురం రూరల్ పరిధిలో వున్న నాలుగు సచివాలయాలతో పాలు రెండు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దినచర్యలో భాగంగా పని విధానాన్ని పరిశీలన చేయాల్సి వుంది. ఇంత పని ఒత్తిడిలో వున్న కార్యదర్శి జనాలకు అందుబాటులో వుండడం కష్టమని లక్షలాది రూపాయలు వెచ్చించి సచివాయాలను నిర్మించి సచివాలయంలో పనిచేసే ఉద్యోగులకు జీతబత్యాలు ఇస్తూ ప్రజలకు అందుబాటులో వుండి సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం వీరిని నియమించింది. అయితే ప్రజలకు అందుబాటులో వుండాల్సిన అవసరం లేదని సచివాలయం ఉద్యోగులు తమ గ్రామాల్లోని ఇళ్ల వద్ద సొంత పనులు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగులను తిరిగి యధాస్థానానికి నియమించాలని పలువురు కాలనీవాసులు కోరుతున్నారు.



సచివాలయంలో ఉద్యోగులు లేని దృశ్యం

# హనుమద్వాహనం పై దర్శనమిచ్చిన కొండమీద రాయుడు



**బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో నెలకొన్న శ్రీకొండమీదవెంకట రమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజు ఆదివారం తిరుమల వెంకటేశ్వరుడు హనుమద్వాహనం పై భక్తులకు దర్శనమిచ్చారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారి రథాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పుష్పలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కు లు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు. నేడు గరుడవాహనం పై దర్శనమివ్వనున్నారు.

← హనుమద్వాహనం పై దర్శనమిచ్చిన వెంకటేశ్వరుడు

4 >>

**అట్టహాసంగా ముగిసిన రాష్ట్రస్థాయి 43వ మా అథ్లెటిక్స్ 2024-25 పోటీలు**

**8 నెలల్లో 48 మందికి 66.6 లక్షల సాయం**

**నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం**

**వెంగమనాయుడు కాలనీలో 20 తులాల బంగారు అభరణాలను అపహరణ**




## చైర్మన్ కు ఈడిగ సంఘం సత్కారం




రమేష్ ను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఆర్యఈడిగ గౌడ సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణప్ప ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శేఖర్ గౌడ్, దేవేంద్రప్ప, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ హరినాథ్, కిరణ్ పాల్గొన్నారు.

## టిడిపికి వాల్మీకులు రుణపడి ఉన్నాం

- వాల్మీకి సంఘం అధ్యక్షులు ఆదినారాయణ



ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

వాల్మీకులపై తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రత్యేక అభిమానంతో హిందూపురం ప్రాంతంలో కీలక పదవులను ఇచ్చిందని ఆ పార్టీకి తామంతా రుణపడి ఉన్నామని హిందూపురం తాలూకా వాల్మీకి సంఘం అధ్యక్షులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వైటి వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బెంగళూరు రోడ్ లో ఉన్న వాల్మీకి కళ్యాణమండపంలో వాల్మీకి సంఘం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గా ఇటీవల ఎన్నికైన డిఇ రమేష్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వెంకట రమణ మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి బీసీల అభివృద్ధికి పార్టీ ప్రాధాన్యత ఇచ్చిందని ముఖ్యంగా వాల్మీకులకు ఉన్న ప్రత్యేక గుర్తింపు ఎనలేనిది అన్నారు. అందుకే మున్సిపల్ చైర్మన్, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవులను హిందూపురానికి ఇచ్చారని బాలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రమేష్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే బాలకృష్ణ చేస్తున్న కృషి చేస్తున్నారని అన్నారు. బాలయ్య ఆశీస్సులతోనే తనకు చైర్మన్ పదవి లభించిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆదినారాయణ, నరసింహులు, ఆకుల సూర్యనారాయణ, వైటిపి శ్రీనివాసులు, శివశంకర్, టికే బాబు, వాల్మీకి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుకళ్యాణ్

హిందూపురం టౌన్ ఫిబ్రవరి 09

ప్రభాతవార్త విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ వేణు కళ్యాణ్ అన్నారు ఆదివారం హిందూపురం సమీపంలోని పులుకుంట గ్రామంలో ఉన్న లోటస్ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వేణు కళ్యాణ్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే సమాజంలో ఉత్తమ పౌరులుగా నిలవచ్చని రాబోయే పరీక్షలను విశ్వాసంతో ఎదురుకోవాలని విద్యార్థులకు తెలిపారు ఈ కార్యక్రమంలో నీలకంఠారెడ్డి, అనిల్ కుమార్, ప్రజిత్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## శివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

-ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడతాం



శివరాత్రి ఉత్సవాలపై సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీదుర్గా పాపనాశేశ్వర వీరభద్రస్వామి దేవాలయంలో ఈ నెల 25 నుండి మార్చి 1వతేదీ వరకు జరగనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని లేపాక్షి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు అంజన్‌రెడ్డి, గ్రామ పెద్దలు తీర్మానించారు. ఈ సందర్భంగా ఇఒ నరసింహమూర్తి మాట్లాడుతూ ఆగమ సాంప్రదాయ పద్దతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాలపట్టిక మేరకు కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఆ సమయానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్ మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవడం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలకు వీరభద్ర అన్నదాన కమిటీ 3 లక్షల రూపాయలను ఇచ్చేందుకు కమిటీ సభ్యులు ఒప్పుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా దేవాదాయశాఖ ఉత్సవాల ఖర్చులకు 8 లక్షల రూపాయలు వెచ్చించడం జరుగుతుందని ఆయన తెలిపాఉ. 26వతేదీన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఉపవాసదీక్షలో ఉన్న బ్రాహ్మణులు ఊరేగింపుగా తీసుకరావడం జరుగుతుందని పేర్కొన్నారు. టిడిపి కన్వీనర్ జయప్ప మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో గ్రామస్తులతో పాటు నాయకులు కూడా సమన్వయంతో పాల్గొని విజయవంతం చేద్దామన్నారు. సమస్యలకు చోటు ఇవ్వరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు గోపికృష్ణ, నాగరాజు, గ్రామపెద్దలు మల్లన్న, సురేష్, చంద్రశేఖర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్, పురావస్తుశాఖ సహాయకులు రాము, దేవాదాయశాఖ సహాయకులు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్

అగళి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

10వ తేదిసోమవారం జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా మడకశిరలో ప్రజా సమస్యలను పరిష్కార వేదికను ఏర్పాటు చేశారని, నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను ఇతరాత్ర సమస్యలను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లే అవకాశాన్ని కల్పించారు కావున నియోజకవర్గ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చ ఏసుకోవాలని ఈ ప్రజా వేదికకు మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి సైతం హాజరు అవుతారని జడ్పిటిసి ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. మడకశిర ప్రజలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికను మడకశిర తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ టిఎస్.ఛేతన్, ఇతర అధికార యంత్రాంగం మొత్తం హాజరవుతారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తె లిపారు. ఈ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు ఇచ్చి పరిష్కారం చేసుకోవాలన్నారు.

## నేడు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

మడకశిర ఫిబ్రవరి 09 ప్రభాతవార్త



ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

నేడు మడకశిర తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని మడకశిర శాసనసభ్యులు ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండు మల తిప్పే స్వామిలు తెలిపారని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. సోమవారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్‌తో పాటు సంయుక్త కలెక్టర్ మరియు పెనుకొండ రెవెన్యూ డివిజన్ అధికారి, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ వ్యక్తి గత సమస్యలు, సామాజిక సమస్యలు మరియు మీమీ గ్రామాలలో నెలకొన్న సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి మీ సమస్యలను పరిష్కరించుకొవాలని శాసనసభ్యులు ఎంఎస్.రాజు మరియు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు తెలియజేశారని అన్నారు. ప్రజలు తమ సమస్యల కోసం ఇచ్చే వినతి పత్రంతో పాటు ఆధార్‌కార్డు జెరాక్స్ మరియు తమ సెల్‌ఫోన్ నంబర్‌లతో హాజరుకావాలని తెలియజేశారు.

## ఘనంగా శివస్వాముల ఇరుముడి కార్యక్రమం



పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, శివస్వాములతో గుండుమల

మడకశిర ఫిబ్రవరి 09 ప్రభాతవార్త

స్థానిక శ్రీచంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివమాల ధరించిన శివస్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునుండే శివస్వాములు స్వామి వారి పూజ భజనలను ఘనంగా నిర్వహించారు. భజనానంతరం అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం గురుస్వామి మాల ధరించిన శివస్వాములకు ఇరుముడులను కట్టారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పూజల అనంతరం ఇరుముడి కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బేగార్లపల్లి రవి, తిమ్మరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరివరంలో అంగరంగ వైభవంగా శ్రీకోడిరంగనాథస్వామి రథోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

లేపాక్షి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండలంలోని సిరివరంన గ్రామంలో ఆదివారం శ్రీకోడిరంగనాథస్వామి రథోత్సవం భక్తజన సందోహం నడుమ అంగరంగవైభవంగా జరిగింది. ఆలయ ట్రస్ట్ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఉదయం శ్రీకోడిరంగనాథస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని ఆలంకరించారు. వేదపండితులు రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ హోమము, నారాయణ హోమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకోడి రంగనాథస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో లేపాక్షి వీరభద్రాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్, మండల టిడిపి కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్ క్రిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు. 12 గంటలకు శ్రీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను గోవింద నామస్మరణ మధ్య ఆలయం నుండి ప్రత్యేకంగా అలంకరించిన రథం వరకు భక్తులు తీసుకొచ్చారు. అనంతరం స్వామివారిని రథంపై వుంచి గోవింద నామస్మరణ మధ్య రథం ముందుకు సాగింది. ఈ రథోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిరివరం, మానేపల్లి గ్రామస్తులతో పాటు కర్ణాటక వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మరథోత్సవం సందర్భంగా పలువురు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## బిజెపి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా మండల స్థాయి కమిటీలు

కన్వీనర్ దేవర రామ్మోహన్

తాడిమర్రి ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త)



దేవర రాము

బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు నేడు (సోమవారం) మండల కేంద్రంలో నిర్వహించనున్న మండల స్థాయి సమావేశానికి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో బిజెపి మండల కమిటీని ఎంపిక చేసేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని అందువల్ల పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకులు కార్యకర్తలు మండల కమిటీలో స్థానం కోసం తమ పేర్లను ఇవ్వాలని తెలిపారు. పేర్లను పరిశీలించిన అనంతరం పార్టీ అధిష్టానం సమర్థవంతమైన నాయకులను మండల కమిటీలోకి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే ఈనెల 13 ,14,వ తేదీల్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఆ రెండు రోజుల్లో ఏదో ఒక రోజు తాడిమర్రి మండలంలో పర్యటించే అవకాశం ఉందని ఈ అంశం పై కూడా సమావేశంలో చర్చించుకోవడం జరుగుతుందని అన్నారు. కావున ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## నేడు నూతన విద్యుత్ భవనం ప్రారంభోత్సవం

కొత్తచెరువు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

కొత్తచెరువు మండల కేంద్రంలో పెనుగొండ రహదారి లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణంలో ఇటీవల నూతనంగా నిర్మించిన విద్యుత్ భవనం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించబడుతుందని టౌన్ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు తెలిపారు ఈ విద్యుత్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులు హాజరుకానున్నారని తెలిపారు అనంతరం రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

## నిమ్మల శ్రీధర్ సొంత డబ్బుతో గోరంట్ల చిత్రావతి బ్రిడ్జి రిపేరి పనులు



రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న టిడిపి నేత నిమ్మల శ్రీధర్

గోరంట్ల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మనసులో మంచి గుణం వుంటే సమాజ సేవకు అడ్డురాదని, జనం పడుతున్న ఇబ్బందుల్లో నేను భాగస్వామ్యమై ఎంతో కొంత సాయపడితే ఆత్మసంతృప్తి లభిస్తుందని సొంత ఊరి జనం కోసం తన సొంత లాభంలో కొంత సొమ్ము ఖర్చు చేయగలిగితే మానవజన్మకు సార్థకత లభిస్తుందని ఒకవైపు వ్యాపారంలో ఆత్మసంతృప్తి మరోవైపు రాజకీయంగా చేసే పనుల్లో ఎదుటి వారికి సాయం అందించాలన్న మహోన్నత మనస్తత్వం టిడిపి నేత నిమ్మల శ్రీధర్‌కే దక్కిందని చెప్పవచ్చు. ఇలాంటి కోవకు చెందిన వ్యక్తే గోరంట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు నిత్యశ్రీ గోల్డ్‌షాపు యజమాని నిమ్మల శ్రీధర్. గోరంట్ల మలడం కేంద్రంలోని చిత్రావతి నదిపై ఇటీవల నిర్మించిన బ్రిడ్జి అతి తక్కువ కాలంలోనే గోతులు పడి ప్రయాణీకులు నరకయాతనగా ఆ బ్రిడ్జిపై ప్రయాణం చేసే పరిస్థితి నెలకొంది. ఈ ప్రమాదకర పరిస్థితిని మానవత్వంతో గమనించిన తెలుగుదేశం పార్టీ నాయకులు నిమ్మల శ్రీధర్ రాష్ట్ర బిసి సంక్షేమశాఖామంత్రి సవితమ్మ ఆదేశాల మేరకు చిత్రావతి నది బ్రిడ్జిపై ఏర్పడిన గోతుల మరమ్మతుల కోసం సొంత ఖర్చుతో పూర్తి చేసేందుకు నిమ్మల శ్రీధర్ శ్రీకారం చుట్టారు. అనుకున్నదే తడవుగా నిమ్మల శ్రీధర్ తన మిత్రబృందంతో ఆదివారం మరమ్మతులు చేపట్టి గోరంట్ల పట్టణ ప్రజల మన్ననలు పొందారు.

**చిత్రావతి నదిపై నాశిరకం పనులతో బ్రిడ్జి..నాటి నాయకుల పాపమే :**

గోరంట్ల పట్టణంలోని చిత్రావతి నదిపై నూతన బ్రిడ్జి నిర్మించాలన్న లక్ష్యంతో మాజీ తెలుగుదేశం పార్టీ ఎంపి నిమ్మల కిష్టప్ప చొరవతో ఆయిల్ కంపెనీ గేల్ సహకారంతో దాదాపు 4 కోట్లకు పైగా ఖర్చుతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టి దాదాపు 80 శాతం పనులు పూర్తయిన సందర్భంలో రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టింది. ఈ నేపథ్యంలో స్థానిక మాజీ ఎమ్మెల్యేగా మాలగుండ్ల శంకర్‌నారాయణ గెలుపొందారు. తెలుగుదేశం పార్టీ పూర్తి చేసిన 80 శాతంపైగా పూర్తయిన అనంతరం మిగిలిన 20 శాతం పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించి నాశిరక పనులు చేశారని తన మంత్రి పదవి మరుసటి రోజుతో ముగిసిపోతుందని ఆగమేఘాల మీద రాత్రికి రాత్రి వంతెనకు రంగులు వేసి రిబ్బన్ కత్తిరించిన సంఘటన తెలిసిందే. శిలాఫలకం మీద పేరు వేయించుకోవాలన్న మక్కువ జీవితకాలం ప్రజలకు ఉపయోగపడే వంతెన నాణ్యంగా నిర్మించాలన్న ఆలోచన లేకపోవడం విచారకమని పలువురు నేటికి విమర్శలు గుప్పిస్తున్నారు.

స్థానిక తెలుగుదేశం పార్టీ నేత నిమ్మల శ్రీధర్ తనవంతు బాధ్యతగా సొంత ఖర్చుతో వంతెనపై మరమ్మతులు చేపట్టి వాహనదారులకు సురక్షిత ప్రయాణానికి సహకరించిన దాత శ్రీధర్‌ను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారని పట్టణ చౌకధాన్యపు డిపో డీలర్ రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.

## వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా విస్తృతస్థాయి సదస్సును జయప్రదం చేద్దాం



ఆహ్వానపత్రికలు అందచేస్తున్న జిల్లా యూనియన్ నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి జిల్లా కమిటీ పర్యవేక్షణలో ధర్మవరం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 13వతేదీన జరగబోవు జిల్లా విస్తృతస్థాయి సదస్సును జయప్రదం చేద్దామంటూ తోటి జర్నలిస్టులకు ఆహ్వానపత్రికలు అందచేశారు. ఈ సందర్భంగా ఆదివారం యూనియన్ జిల్లా అధ్యక్షులు పుల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు, యూనియన్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ జివి నారాయణ, ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షులు గోల్డ్ ప్రసాద్, సహాయ కార్యదర్శి రమణ, తదితరులు గోరంట్ల మండల జర్నలిస్టులకు ఆహ్వానపత్రికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, లీగల్ పాయింట్ మస్తాన్, ఆంధ్రప్రభ లక్ష్మీనారాయణ, జనసేన మహేష్, జనం న్యూస్ ఫకృద్దీన్, మనం కిష్టప్ప, సూర్య వెలుగు నర్సా రెడ్డి, పబ్లిక్ వాయిస్ ఇబ్రహీం పాల్గొన్నారు.

## మా గ్రామానికి రోడ్డు వేయడానికి ఇంకెన్ని సంవత్సరాలు?

తాడిమర్రి ఫిబ్రవరి 9 (ప్రభాతవార్త)



గుంతల మయమైన రోడ్డును చూపిస్తున్న గ్రామస్తులు

మండల పరిధిలోని దాడి తోట నాయన పల్లి మీదుగా తిమ్మంపల్లి వెళ్లే రహదారిని ప్రభుత్వాలు మారుతున్న గత పది సంవత్సరాల నుంచి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకు ముందు ధర్మవరం డిపో చెందిన ఆర్టీసీ బస్సు రోజుకు ఆరు సింగిల్స్ నడిపేవారు. ఇప్పుడు రోడ్డు సరిగా లేనందువలన రోజుకి ఒక్క రాత్రి 9 గంటలు ఉదయం 5 గంటలు సర్వీస్ మాత్రమే బస్సు నడుపుతున్నారు. బస్సు సౌకర్యం లేనందువలన నాయన పల్లి నుంచి దాడితోట జిల్లా పరిషత్ స్కూల్ కి వెళ్లలేక చదువులు మానేసి పొలం పనులకు వెళ్తున్నారు. సంక్రాంతి వరకు గుంతలు లేని రహదారులు చూస్తారని కూటమి ప్రభుత్వం చెప్పింది.కానీ ఇప్పటివరకు నాయన పల్లి గ్రామ ప్రజల రోడ్డు కష్టాలను అలాగే ఉన్నాయి. కావున రహదారిని మంజూరు చేసి విద్యార్థుల కష్టాలను గ్రామ ప్రజలు రైతుల కష్టాలను తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ క్రీడలకు ఎంపికైన అధ్యాపకుడు చంద్రమోహన్

శ్రీసత్యసాయిజిల్లా, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త ప్రతినిధి:



పతకాలతో చంద్రమోహన్

అనంతపురం పిటిసి గ్రౌండ్ నందు రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7నుండి 9వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ స్టేట్ 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడా పోటీలలో కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి గ్రామానికి చెందిన ఒంటికొండ చంద్రమోహన్ ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈయన తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇఇఇ అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున 200 మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్ లో కాంస్య పతకం సాధించి మార్చి 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు బెంగళూరులో జరగబోయే 45వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనటానికి అర్హత సాధించారు. అధ్యాపకుడిగా తన భాధ్యతలు నిర్వర్తిస్తూనే క్రీడలలో కూడా తన ప్రతిభని కనపరుస్తూ విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నందుకు ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

## హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

-ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఎస్‌పి వి.రత్న



పోలీస్ లాంఛనాలతో నారాయణనాయక్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పుట్టపర్తి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త

మండల పరిధిలోని పెదపల్లి గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ నారాయణ నాయక్ (హెచ్‌సి 21 ) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ లోని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీంతో ఆదివారం పుట్టపర్తి మండలం పెదవల్లి గ్రామంలో ఆయన భౌతిక కాయానికి ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇతను 1993లో పోలీస్ కానిస్టేబుల్‌గా చేరి వివిధ ప్రాంతాలలో విధులు నిర్వహించారు. పదోన్నతితో హెడ్ కానిస్టేబుల్ గా అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య శాంతాబాయి , కుమారుడు, కూతురు ఉన్నారు. నారాయణ నాయక్ మృతిపల్లి శ్రీతస్యసాయి జిల్లా ఎస్‌పి వి.రత్న తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల కార్యక్రమంలో అనంతపురం టూ టౌన్ సిఐ శ్రీకాంత్, పుట్టపర్తి రూరల్ ఎస్సై లింగన్న పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్య కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , హరినాథ్ , లక్ష్మీనారాయణ , గాండ్ల హరినాథ్, సిబ్బంది బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో ఉత్సవాలపై సమీక్ష

అమరాపురం పిబ్రవరి 9 ప్రభాతవార్త



రామచంద్రప్ప

మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హేంజేరు సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సోమవారం మధ్యాహ్నం సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథులుగా మడకశిర నియోజకవర్గ శాసన సభ్యులు యం.యస్.రాజు,మాజీ శాసన మండలిసభ్యులు శ్రీ.గుండుమల తిప్పేస్వామిలు హాజరవుతున్నట్లు నియోజకవర్గ టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్లమారనపల్లి రామచంద్రప్ప ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ్ సీనియర్ టిడిపి నాయకులు కుమార్ స్వామి, జయ కుమార్, తిప్పజ్జ, ఓంకార్ స్వామి,కృష్ణమూర్తిలు తెలిపారు. అతిథి గృహం నందు జరిగే ఈ సమావేశానికి గ్రామ పెద్దలు వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

## ఘనంగా శ్రీ కెంచమాంబదేవికి విశేషపూజలు



కేంచమాంబ దేవి దృశ్యం

అమరాపురం ఫిబ్రవరి 9ప్రభాతవార్త

మండల పరిధిలో గౌడనకుంట గ్రామంలో వెలసిన కుంచిటిగ సోమేనహళ్ళి జానకల్లు గోత్రానికి చెందిన ఆరాధ్య దైవం శ్రీ కెంచమాంబ దేవి పెద్ద జాత్ర ఉత్సవాలలో ఆదివారం అమ్మవారి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. అదేవిధంగా పూజ కార్యక్రమాన్ని నిర్వహించి గుంటనూరు ద్యామలాంబ దేవి తీర్థ ప్రసాదాన్ని భక్తులకు వినియోగం చేశారు.ఈ సందర్భంగా కేంచామాంబ దేవికి విశేష పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంచమాంబ దేవి దేవస్థాన సేవా సమితి అధ్యక్షులు అమరాపురం లింగరాజు, ఉపాధ్యక్షులు మద్దనకుంట జె. మంజునాథ్, కార్యదర్శి తమ్మడేపల్లి ఈర సంయుక్త కార్యదర్శి గౌడనకుంట నారాయణరెడ్డి, ట్రెజరర్ గౌడనకుంట లింగన్న, మరియు దేవాలయ సభ్యులు ఈశ్వరప్ప,నింగణ్ణ,సిద్దప్ప,ఈరలింగప్ప,శివానందప్ప,దేవరాజు,అమరాపురంగోపినాథ్ ,అమరాపురం యంజారప్ప,అమరాపురం రఘు, ఈరలింగప్ప, విశ్వేశ్వర, ఉగ్రనరసింహ, గురుసిద్ధప్ప, జయరామప్ప, వీరక్యాతరాయప్ప పాల్గొన్నారు. నేడు జలదిఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## వైసీపీ కార్యకర్తపై వేట కొడవలితో దాడి

కనగానపల్లి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



గాయపడిన చాకలి నరసింహులు

మండల పరిధిలోని గుంతపల్లికి గ్రామానికి చెందిన చాకలి నరసింహులు ను తుముచెర్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బోర్ల చెన్నప్ప తోపాటు ఆయన అనుచరులు కలిసి వేటకొడవలితో దాడి చేసి గాయపరిచారు. స్థానికులు పోలీసుల సమాచారం మేరకు వైసీపీ కార్యకర్త చాకలి నరసింహులు ఆదివారం మధ్యాహ్నం తగరకుంట ఊరు చివర ఉన్న వెల్డింగ్ షాప్ వద్ద ఆవుల షెడ్డు కోసం కడ్డీలు వెల్డింగ్ చేయిస్తుండగా తూముచెర్ల గ్రామానికిచెందిన టిడిపి నాయకుడు బోర్ల చెన్నప్ప ఆయన అనుచరులు వచ్చి ఎంపీటీసీ ఎలక్షన్లో నేను ఓడిపోవడానికి నువ్వు కూడా కారణమని చాలా ఎక్కువ చేసావని ఇప్పుడు నిన్ను ఏం చేసినా దిక్కు ఎవరని అంటూ మాట మాట పెరగడంతో బోర్ల చెన్నప్ప కోపోద్రుకుడై అక్కడే ఉన్న వేట కొడవలితో నరసింహులు కుడికాలు ను నరకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు అనంతరం అక్కడే ఉన్న స్థానికులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు . గాయపడిన చాకలి నరసింహులు అనంతరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సమాచారం అందుకొని జరిగిన ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## నేటి నుండి జరగనున్న ప్రయోగ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- సీసీ కెమెరాలు నిఘా ఏర్పాటు

జిల్లాలో 5749 మంది విద్యార్థులకు 47 ప్రయోగ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు : డి ఐ ఈ ఓ రఘునాథ రెడ్డి

కొత్తచెరువు, ఫిబ్రవరి 9, ప్రభతవార్త

ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు నేటి నుండి జరుగు ప్రయోగ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డి ఐ ఈ ఓ రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేటి నుండి జరుగు ప్రయోగ పరీక్షలు సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 47 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 5749 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ ప్రయోగ పరీక్షలు రెండు సెషన్స్ గా జరుగుతాయని ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుండి ఐదు గంటల వరకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలు సీసీ కెమెరాలు నిఘాలో జరుగుతాయని, పరీక్ష కేంద్రాలలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని, విద్యార్థులకు తాగు నీరు, వెలుతురు, గాలి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఐఈఓ రఘునాథరెడ్డి తో పాటు డి ఈ సి సభ్యులు సురేష్ బాబు, రామరాజు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

03ATP09_03ATP09.qxd 09-02-2025 PM 11:20 Page 1



## విద్యుత్ కేబుల్ అపహరణ


విద్యుత్ కేబుల్ కత్తిరించిన దృశ్యం

శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
మండల పరిధిలోని పెద్దమట్లగొంది, చిన్నమట్ల గొంది గ్రామాల్లోని తోటలో రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పలువురి రైతుల విద్యుత్ కేబుల్‌వైర్లు అపహరించారు. వరుసగా మూడోసారి ఈ గ్రామాల్లోని విద్యుత్ వైర్లు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. పెద్ద మట్ల గొంది గ్రామానికి చెందిన గోపాల్, రాజగోపాల్, వీరయ్య, చిన్నమట్ల గొంది గ్రామానికి చెందిన పి.ఆదినారాయణ, ఎ.లక్ష్మినారాయణ, పి.ఆంజినేయులులకు చెందిన విద్యుత్ కేబుల్ వైర్లను దొంగిలించినట్లు వారు తెలిపారు. ఆదివారం పోలీసులకు పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వరుస దొంగతనాలతో తమకు దొంగలు తీవ్ర ఇబ్బందిపెడుతున్నారని, పోలీసులు కేబుల్ దొంగలపై ప్రత్యేక నిఘా ఉంచి పట్టుకోవాలని వారు కోరారు.

## నేడు పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ
### - తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్


డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
నేడు (సోమవారం) మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ పిల్లలకు ఆల్ బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తరిమెల వైద్యాధికారులు డాక్టర్ శంకర్ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లోని 1 నుంచి 19 ఏళ్లలోపు ఉన్న వారికి ఆల్‌బెం డజోల్-400 ఎంజి మాత్రలను ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు, నేడు హాజరు కాని వారికి 17వ తేదిన అందిం చేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రతి ఆరు నెలలకు ఓసారి ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## శిల్పారామంలో భరతనాట్య ప్రదర్శనలు


నృత్యం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, ఫిబ్రవరి09 ప్రభాతవార్త :
అనంత రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయితీలో గల శిల్పారామంలో సంస్కృతీ సంప్రదాయాల సమాహారం, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీ దేవి నృత్య కళా నిలయం, నృత్య గురువు, కుమారి హిమజ, అనంతపురము వాస్తవ్యులు వారి శిష్య బృందంచే భరతనాట్య నృత్య ప్రదర్శనలు సాయంత్రం 5:30 గం.ల నుంచి రాత్రి 7:00 వరకు సాం స్కృతిక కార్యక్రమమునిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శించు అంశాలు : మహాగణపతిం, బాల త్రిపుర సుందరి, శివుడు ధరించిన, గుమ్మని ఏదిస్తృతి, కుందనపు బొమ్మ, ఇదిగో భద్రాద్రి, వేదములే, హిమగిరి, నగుమోము, నటేశ కౌత్వం నృత్య కళాకారుల పేర్లు: వర్షిత నిహారిక హర్షిక వర్షిణి రేషిక తన్వి ప్రియ దర్శిని శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.క్రిష్ణప్రసాద్ తెలిపారు.

## కిలాడీ లేడీలు.. నకిలీ స్క్రీన్‌షాట్‌తో మోసం


షాపింగ్ చేస్తున్న మహిళలు

శింగనమల,
ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ముందు జిజి టెక్స్‌టైల్స్ దుకాణంలో ఆదివారం ముగ్గురు కిలాడీ లేడీలు పాత స్క్రీన్ షాట్ చూపించి దుకాణం యజమానిని మోసం చేశారు. యజమాని హుస్సేన్‌సాబ్ తెలిపిన వివరాల మేరకు ఆదివారం సాయంత్రం 5:45 గంటలకు ముగ్గురు మహిళలు అంగడి వద్దకు వచ్చి చీరలు, డ్రస్సులు మొత్తం 6200 రూపాయల బట్టలు తీసుకుని వారి ఫోన్ ద్వారా స్కాన్ చేసి డబ్బులు పంపినట్లు తనకు స్క్రీన్ ఏట్ చూపించి వేగంగా వారు వచ్చిన కారులో వెళ్లిపోయారని, అయితే ఎంత సేపటికి డబ్బులు జమకావడంతో ఫోన్ పే పరిశీలించడంతో వారు అసలు డబ్బులు పంపలేదని తెలుసుకుని వారి కోసం వెతకగా అప్పటికే వారు ఉడాయించినట్లు ఆయన తెలిపారు. అయితే ఆ మహిళలు గతంలో డబ్బులు చెల్లించిన స్క్రీన్ షాట్‌ను చూపించి తమను మోసం చేసినట్లు దుకాణ యజమాని హుస్సేన్‌సాబ్ తెలిపారు.

## నూతన మండల కన్వీనర్‌కు సన్మానం


వైకాపా మండల కన్వీనర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
యాడికి వైకాపా నూతన కన్వీనర్‌గా ఎంపికైన సంజీవ రాయుడును ఆదివా రం నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు సత్కరించారు. అదిష్టానం తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మండల స్థాయి పదవిని కట్టబెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం సభ్యులు రామకృష్ణ, శ్రీనివాసులు, బాలాంజనేయులు, లక్ష్మినారాయణ, నాగేంద్ర, శ్రీరంగ, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ ఎంపిటిసి మృతి


మృతి చెందిన రామాంజనేయులు

యాడికి,
ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన వైకాపా సీనియర్ నాయకుడు, మాజీ ఎంపిటిసి రజక రామాంజనేయులు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గత రెండు రోజుల క్రితం పక్షవాతం, బిపి తదితర అనారోగ్య సమస్యలతో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

## దర్గా వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయండి
### - డిఎస్పీ విజయకుమార్


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్పీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :
మండలంలోని అచ్చా మియా పల్లిలో నిర్వహిస్తున్న ప్రవిత అచ్చామియా దర్గా ఉత్సవాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పుట్టపర్తి డిఎస్పీ విజయ్‌కుమార్ ఎస్సై మల్లికార్జునరెడ్డిని ఆదేశించారు. ఆదివారం డిఎస్పీ విజయకుమార్‌తో పాటు ఎస్సై మల్లికార్జునరెడ్డి అచ్చా మియా దర్గా పరిసరాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. దర్గా పరిసరాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అదే విధంగా గ్యాబ్లింగ్, ఇతర జూదం, నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా పెట్టాలని సూచించారు. రద్దీ ఉన్న వేళ ఆకతాయిలు చైన్ స్నాచింగ్, పిక్‌పాకెట్‌లు చేసే అవకాశాలు ఉంటాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బోనగిరి మోనేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు


అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్,
ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :
ఆదివారం రాప్తాడు నియో జకవర్గ వైకాపా మాజీ యూత్ కన్వీనర్, కట్టకిందపల్లి గ్రామ సర్పంచ్ శోభ వరప్రసాద్ రెడ్డి కుమారుడు బోనగిరి మోనేష్ రెడ్డి జన్మదిన వేడుకలను కుటు ంబ సభ్యులు వారి నివాసంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మోనేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా పలువురు నాయకులు బోనగిరి కుటుంబ సభ్యులు మోనేష్ రెడ్డికి పుష్ప గుచ్చాలు అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ మోనేష్ రెడ్డి జన్మదిన వేడుకలను రూరల్ మండలంలోనివైకాపా నాయకులు, బోనగిరి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తుకోవడం. జరిగిందన్నారు. మోనేష్ రెడ్డి నిండు నూరేళ్ల ఆరోగ్యంగాను. కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని ఆ దేవుని కోరుకోవడంజరుగుతుందన్నారు. బోనగిరి మోనేష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించి 500 మంది రోగులకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో బోన గిరి కుటుంబ సభ్యులు, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గీతకులాలకు నేడు మద్యం షాపుల కేటాయింపు

అనంతపురం ఓల్డ్ టౌన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
గీతకుల కార్మికులకు లాటరీ ద్వారా కొత్త మద్యం షాపుల కేటాయింపు నేడు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో 9 గంటలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన లాటరీ ప్రక్రియ చేపడతామని దరఖాస్తుదారులు గంట ముందుగా జిల్లా పరిషత్ ప్రాంగణంలోకి చేరుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది లాటరీ ప్రక్రియ జరిగే విధానం గురించి తొలిత వివరిస్తారని అనంతరం లాటరీ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

## రైతులు గుర్తింపు కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోండి
### - మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాష

యాడికి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
మండలంలోని రైతులకు నూతనంగా ఆధార్‌కార్డు లాగా గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతోందని దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వల్ల రైతులు నేరుగా లబ్ధి పొందడం కోసం పారదర్శకత పాటించడం కోసం ఈ గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాష తెలిపారు. వీటివల్ల సాంకేతిక లోపాలు లేకుండా ప్రభుత్వం విడుదల చేసే ఏ పథకమైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతుందని సూచించారు. వీటి ద్వారానే రైతులకు పిఎం కిసాన్ పథకం, బ్యాంకు రుణాలు, పెట్టుబడి రాయితీలు, వివిధ రకాల సబ్సిడీలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ తమ రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ అధికారిని సంప్రదించి గుర్తింపు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్‌కార్డు, ఆధార్‌కార్డుకు లింక్ అయిన మొబైల్ నెంబర్, పట్టాదారు పాస్‌పుస్తకం తప్పనిసరిగా తీసుకెళ్లాలని దరఖాస్తు చేసుకోవడానికి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

## ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలం కోసం అర్జీల కార్యక్రమం


అర్జీల కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
తాడిపత్రి పట్టణంలో ఇళ్ల లేని నిరుపేదలకు ఇంటి స్థలం కోసం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అర్జీల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ ఇళ్ల లేని నిరుపేదలకు ఇంటి స్థలం కోసం అర్జీల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇళ్ల లేని నిరుపేదలకు మేము అధికారంలోకి వస్తే పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు 4 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని వాగ్దానం చేశారని ఆ వాగ్ధాదాన్ని నిలుపుకోవాలని పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు కేటాయించి ఇంటి నిర్మాణానికి ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ఉచితంగా అందచేయడంతో 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరా ములు, రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య, అబ్రహం, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాలతో ఆర్‌ఆర్ విద్యుత్ పరికరాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు


హాజరైన ఎలక్ట్రీషియన్లు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
ఆర్‌ఆర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ అందిస్తున్న విద్యుత్ సామాగ్రి నాణ్యతా ప్రమాణాలతో తయారు చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని సాయితేజ సినిమా థియేటర్ ఎదురుగా వున్న ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆర్‌పి ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్‌ఆర్ సంస్థ సామాగ్రి నాణ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఆర్ సంస్థ ద్వారా చేస్తున్న ఉత్పత్తులు పలు రకాల వైర్లు, సామాగ్రి ఎంతో నాణ్యత పాటిస్తూ మార్కెట్‌లోకి తీసుకొస్తున్నామన్నారు. అందుకు సంబంధించి పట్టణంలోని ఎలక్ట్రీషిన్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు రవీంద్రనాథ్‌రెడ్డి, జంగంరెడ్డి, పట్టణంలోని ఎలక్ట్రీషియన్లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతిపై అనుచిత వ్యాఖ్యలు తగవు
### - షకీల్ షఫీపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ముస్లిం మైనార్టీ సోదరులు


ఫిర్యాదు చేస్తున్న ముస్లిం మైనార్టీలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త :
ముస్లిం మైనార్టీలు పరమ ప్రవితంగా భావించే కడప అమీన్ పీర్ దర్గా విశిష్టతను దెబ్బతీసే విధంగా అనుచిత వా ్యఖలు చేసిన షకీల్ షఫీపై కఠిన చర్యలు తీసుకోవాలని కొ ండకమర్లకు చెందిన పలువురు ముస్లిం సోదరులు, అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి శిష్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మలికార్జునరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతపురం నగరానికి చెందిన షకీల్ షఫీ ఇస్లాం మతానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, మైనార్టీల్లో అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఎంతో ప్రాముఖ్యత గల కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతిపైన, మత విశ్వాసాలపైన అతను దుష్ప్రచారం చేస్తున్నాడన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు వల్ల ముస్లిం మైనార్టీల్లో ఆలజడి చలరేగే ప్రమాదం ఉందన్నారు. కనుక అతనిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జౌవులి ఆరిపుల్లా, పోగాకు షానవాజ్, కొలిమి మగ్దముల్లా ఖాన్, కొలిమి షానవాజ్ తదితరులు ఎస్సైని కోరారు.

## రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోండి - ఏవో భారతి


ఏవో భారతి

.నల్లచెరువు ఫిబ్రవరి 9. ప్రభాతవార్త.
నల్లచెరువు మండలంలో ఉన్నటువంటి రైతులు అందరికీ రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను నమోదు చేసుకోవాలని ఆదివారం వ్యవసాయ అధికారి ఏవో భారతి ప్రకటన తెలిపారు, ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి ప్రతి గ్రామం లో భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం జరుగుతుందని ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం.ని రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందని రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా వర్తిస్తుందని ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందని 1.పీఎం కిసాన్ చెల్లింపులు 2.అన్నదాత సుఖీభ వ3.పంటల భీమా 4.పంట రుణాలపై వడ్డీ రాయితీ 5.రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, 6.రాయితీ పై సూక్ష్మ పోషకాలు, 7.సూక్ష్మసేద్యం పై రాయితీ, 8.పంట రుణాలు 9.పెట్టుబడి సా యం.. తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుంది. నీటిపారుదల, తెగుళ్ళ నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకో వడానికి తోడ్పడుతుంది. గ్రామంలో గల రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్య పొందవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు, మున్ముందు కౌలు రైతులకు, భూములేని వ్యవ సాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు నమోదు విధానం: జత పరచినవి రైతులు వారి 1.ఆధార్ నెంబర్ 2.ఆధార్ అనుసంధారిక ఫోన్ నెంబర్ 3.భూమి రికార్డులు వివరములు (పట్టాదారు పాస్ బుక్) తీసుకొని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. తెలిపారు.

## ఎమ్మెల్యే భరత్‌రెడ్డిచే రైల్వే అండర్ పాస్‌లో వాహన సంచారం ప్రారంభం


నూతనంగా ఆధునీకీకరించిన రైల్వే అండర్ పాస్ రోడ్డులో రాకపోకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ సయ్యద్ నాసీర్‌హుసేన్‌లు

బళ్లారి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త;
నగరంలోని ముఖ్యమైన రోడ్డుగా ఉన్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం వద్ద గల రైల్వే అండర్ పాస్ రోడ్డులో చేపట్టిన అభివృద్ధి, ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో రోడ్డులో వాహనాల సంచారాన్ని స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం 6;30 గంటలకు ప్రారంభించారు. సుమారు రెండు నెలలపాటు ఈ రోడ్డులో వాహనాల రాకపోకలు బంద్ చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.1.80 కోట్ల వ్యయంతో సిమెంట్ రహదారి నిర్మాణంతోపాటు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, అండర్ పాస్‌లో గల గోడలకు రంగురంగుల డిజైన్, విద్యుత్ దీపాల వెలుగుతో సుందరంగా తీర్చిదిద్దడం కనిపించింది. రైలే ్వ అండర్ పాస్ ప్రారంభిస్తున్న సమాచారం తెలిసి అనేక మంది ప్రజలు అండర్ పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఈ సందర్భంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఏదేని అభివృద్ధికి ప్రజల సహకారం ఉండాలని, రెండు నెలలపాటు ఈ రోడ్డు బంద్ కావడంతో ప్రజలు రెండు కి.మీ. చుట్టూ వెళ్లి నగరంలోకి వెళ్లాల్సి వచ్చిందని, ప్రయాసతో నగరంలోకి సంచారం చేసిన ప్రజలు రైలే ్వ అండర్ పాస్‌లో జరిగే అభివృద్ధి పనులకు సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. పనుల విషయంలో నాణ్యతతో ఉండేలా తాను ప్రాధాన్యతనిస్తానని, ఈ నేపథ్యంలోనే రైలే ్వ అండర్ పాస్‌లో జరిగే అభివృద్ధి, ఆధునీకరణ పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి 20 సంవత్సరాల వరకు ఈ రహదారిలో ఎటువంటి లోపాలు లేకుండా వాహనాల రాకపోకలు సాఫీగా వెళ్లేవిధంగా ఫుట్‌పాత్‌లపై నడిచే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఈ సందర్భంలో రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్‌నాసీర్ హుసేన్, నగర మేయర్ ముల్ల ంగి నందీష్, వక్ ్ఫబోర్డు అధ్యక్షులు హుమయూన్‌ఖాన్, ఉప మేయర్ డి.సుకుం, లిడ్కర్ అధ్యక్షులు ముంద్రగి నాగరాజ్, కమ్మ మహాజన సంఘం అధ్యక్షులు ఎం.అనూప్‌కుమార్, రెడ్డి మహాజన సంఘం అధ్యక్షులు నారా ప్రతాప్‌రెడ్డి, అఖిల భారత వీరశైవ మహాసభ నాయకులు డి.శివానంద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ.మానయ్య, ఆయాజ్‌అహ్మద్, అస్లాంపర్వేజ్, మహానగరపాలికెకు చెందిన కార్పొరేటర్లు చానాళ్ శేఖర్, గుడ్లు రవి, చంప చవాన్, రాము చవాన్, షమీమ్, సల్మా ఎస్.కె.అఖీల తదితరులు పాల్గొన్నారు. అండర్ బ్రిడ్జిలో గోడలకు ఇరువైపులా విద్యుత్ దీపాల అలంకరణతో పాటు పూల తోరణాలతో అలంకరించి కళ్లు మిరమిట్లు గొలిపేలా రంగురంగుల విద్యుత్ దీపాలతో అనేకమంది స్థానికులు అండర్ గ్రౌండ్‌లో సెల్ఫీలు దిగేందుకు ఉబలాటపడడం కనిపించింది. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు క్రేన్ ద్వారా భారీ గజమాలను వేయడంతోపాటు పూల జల్లు కురిపించారు.

## ముస్లీం సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా
### - అల్లా కృపతోనే ఎమ్మెల్యేగా గెలిచాను.... ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి


ముస్లీం సోదరుల షాదిమహల్ నిర్మాణం కోసం రూ.కోటి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త;
దేశంలోని ముస్లీం సోదరులు స్వాతంత్ర్యం కొరకు ఎన్నో త్యాగాలు చేశారని, బళ్లారి ఎమ్మెల్యేగా తన గెలుపుకు ముస్లీం సోదరులు అందించిన మద్దతు మరిచిపోలేనిదని, వారికి రుణపడి, వారి అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తానని స్థానిక ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. ముస్లీం సమాజం నాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. నగరంలోని 21 మసీదులకు రూ.2.20 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు, అదేవిధంగా రెండు షాదీమహాల్ భవనాల నిర్మాణం కోసం రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ముస్లీం సోదరులు తన గెలుపుకు ఎంతో మద్దతు నిచ్చారని, వారికి రుణపడి పనులు చేసి పెడతానని చెప్పారు. వక్ఫ్‌మండలి ఆస్తి దేవుడికి సంబంధించినది, వక్ఫ్ ఆస్తుల రక్షణ మనందరి బాధ్యత, హవంబావిలో వక్ఫ్ స్థలాన్ని కొందరు ఆక్రమణ చేసుకున్నట్లు తెలిసిందని, వెంటనే తాను కోర్టు ద్వారా సదరు ఆస్తిని రక్షించే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. విధానసభ ఎన్నికల సందర్భంలో తనను గెలిపించి నేడు తనకు సత్కారం చేస్తున్నారని, మీ అందరికీ నేను చిన్న వయస్సు వాడినేనని, ఎన్నికల సందర్భంలో నేను మీ వద్దకు పోటీలో నిలబడగా నాకు అవకాశం ఇచ్చారని, నా తల్లిదండ్రుల ఆశీర్వాదంతోపాటు అల్లా కృపతోనే నేను ఎమ్మె ల్యేగా ఎన్నికయ్యానని చెప్పారు. ముఖ్యమంత్రిని కలి సి బళ్లారికి రెండు షాది మహాల్ భవనాలకు నిధులు మంజూరు చేయించానని తెలిపిన ఎమ్మెల్యే, ఏ సమస్య, కష్టం వచ్చినా నేరుగా తనకు తెల పాలని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు డా.సయ్యద్ నాసీర్ హుసేన్ మాట్లాడుతూ బళ్లారి రూరల్ ప్రాంతంలో ముస్లీం సముదాయానికి చెందిన వేలాది కుటుంబాలు ఉన్నందున రెండు షాదిమహాల్ భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముల్లంగి నందీష్, నాయకులు హుమ యూన్‌ఖాన్, మెహదీ మియాసాహెబ్, ఖాజీగులామ్ మహమ్మ దస్‌సిద్ధిఖీ, పీర్ బాషాసాహెబ్, ఖాజున్‌సాహెబ్, హాజీలియాస్ సాహెబ్, భంభ ఒదాదా భాయి, ముర్తుజా ఖాన్ సాహెబ్, హుసేన్‌పీరా, మైనూభాయి, అస్లాం పర్వేజ్, కార్పొరేటర్ నూర్ అహ్మద్, కణేకల్ మాబుసాబ్ తదితర ముస్లీం నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన దామోదర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


దామోదర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తనకల్లు, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త:
తనకల్లు మండల కేంద్రం లోని ఇందిరా నగర్‌లో నివా సం ఎంటున్న తెదేపా వార్డు మంబర్ తీరువల్లి దామోదర్ జనవరి నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడినాడని విష యం తెలుసుకున్న కదిరి ని యోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయన్ను యోగక్షేమాల గురించి అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్ర సాద్ మాటా ్లడుతూ ఆ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : పుట్టపర్తి శాసనసభ్యులు శ్రీమతి పల్లె సింధూరరెడ్డి నేడు(సోమవారం) మండలంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే పిఆర్వో సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. మధ్యాహ్నం 2.30 చౌడంపల్లిలో గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ కోందడరామాలయ విగ్రహ ప్రతిష్ట, 3.30 గంటలకు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార మ్మర్లు పంపిణీలో పాల్గొంటారు. సాయంత్రం 7 గంటలకు అచ్చామియాపల్లిలో ఉర్సు కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డితో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి హజరవుతారన్నారు. కనుక స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## సీతారాముల ఆలయానికి విరాళం అందజేసిన శంకారపు వెంకటరమణ


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న శంకా రపు వెంకటరమణ,

నల్లచెరువు ఫిబ్రవరి 9. ప్రభాతవార్త నల్లచెరువు మండలంలోని అధునాతన రూపురేఖలతో పునర్వహ ప్రారంభంతో నూతనంగా నిర్మించబడుతున్న సీతారాముల దేవస్థానమునకు గ్రామస్తుల సహకారంతో ఆలయం అభివృద్ధి పనులు జరుగుతు న్నాయి . అదేవిధంగా నల్లచెరువు మండలానికి చెందిన శంకారపు వెంకటరమణ స్వామి వారికి తమ వంతు స్వామివారి కృపకు పాలుపంచు కుంటూ.10.116 విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజే శారు. ఆలయ కమిటీ సభ్యులు శంకార పు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన మూర్తులు పడమూరి నగేష్. వేమయ్య. లక్ష్మీనారాయణ .శ్రీరాములు. పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెల్ షాపు దగ్ధం
### - రూ.15 లక్షల ఆస్తి నష్టం


దగ్ధమైన సెల్ షాపు

కదిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త
పట్టణంలోని వలిషాపు రోడ్డులోని సెల్ దుకాణంలో అకస్మాత్తుగా సంభవించిన విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో రూ.15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించి దుకాణ యజమాని షేక్ ఫకృద్దీన్ తెలిపిన వివరాల మేరకు ప్రతిరోజులాగే ఉదయం 10 గంటల సమయంలో తన షాపులో పనిచేసే అఫ్రిద్ దుకాణం ఓపెన్ చేసి టిఫిన్ చేయడానికి బయటికి వెళ్లాడన్నారు. ఆ సమయంలో తన షాపులో ప్రమాద వశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో దుకాణంలో ఉన్న విలువైన మొబైల్‌ఫోన్లు, సామాగ్రి మొత్తం కాలి బూడిదైందన్నారు. ఈ విషయంపై పట్టణ సిఐ డివి నారాయణరెడ్డికి దుకాణ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**బాధితున్ని ఆదుకోండి : ఎమ్మెల్యే :** వలిసాబ్ రోడ్డులో ప్రమాద వశాత్తు జరిగిన విద్యుత్‌షాక్‌సర్క్యూట్‌తో దుకానం మొత్తం కాలి బూడిందైందని, దీంతో దుకాణ యజమాని తీవ్రంగా నష్టపోయారని, అధికారులు స్పందించి బాధజతున్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తహశీల్దారు మురళీకృష్ణను ఆదేశించారు. తహశీల్దారు వెంటనే విఆర్‌ఓ ఇనాయతుల్లాకు దగ్ధమైన దుకాణాన్ని పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించడంతో విఆర్‌ఓ దగ్ధమైన దుకాణాన్ని పరిశీలించి నివేదికను అందజేశారు.

## చౌడంపల్లిలో ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజలు


హోమం నిర్వహిస్తున్న వేద పడింతులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : మండలంలోని అల్లాపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని చౌడం పల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం వద్ద గ్రామ పెద ్దల ఆధ్వర్యంలో ఆదివారం ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజ లు నిర్వహించారు. వేదపండి తులు పంచరత్న సురేష్ శర్మ, హర్షవర్ధన్, సంతోష్, మహేష్‌లు గణపతికి పూజలు నిర్వహించిన అనం తరం హోమాలు, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, గంగ పూజ, పుణ్య హాము, కలశస్థాపన, రక్షాబంధం, వేదపారాయణం, పున:పూజ, మృత్య కాపూజలు, పంచగవ్య, ప్రోక్షణ, ప్రాశన, శ్రీ గణపతి, హనుమ, నవగ్ర ్హ హోమాలు, ధ్వస్థంభ ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్ర ్సాదాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# 8 నెలల్లో 48 మందికి 66.6 లక్షల సాయం

## - 8వ విడతలో 9 మందికి 9 లోల 30 వేల రూపాయల చెక్కులు అందజేత - సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే దగ్గుపాటి




సిఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యాలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

గత ఐదేళ్లలో సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందాలంటే నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేదని,కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడిగిన వెంటనే సాయం చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. టిడిపి అర్బన్‌కార్యా లయంలో ఆదివారం 8వ విడత సిఎంఆర్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు. మొత్తం 9 మంది లబ్ధిదారులకు 9 లక్షల 30 వేల రూపాయల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. గత 8 నెలల్లో 8 విడతల్లో 48 మందికి 66.62 లోల రూపాయలు సిఎంఆర్ఎఫ్ కింద అనంతపురం అర్బన్ నియోజక వర్గంలో సాయం అందించిన్నారు. అడిగిన వెంటనే స్పందిస్తున్న ముఖ్య మంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు కష్టం ఉందంటే ఒక క్షణం కూడా ఆలోచించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో సీఎం ఆర్ఎఫ్ వచ్చిన దాఖలాలే కనిపించలేదన్నారు. కూటమి వచ్చాక నెలకు 10 మంది చొప్పున సాయం అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర ప్రధాన కార్యదర ఇశ ముక్తియార్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్ మూర్తి, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పిఎం లక్ష్మి ప్రసాద్, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి నాయకులు గోపాల్‌గౌడ్, వేలూ సిఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యాలురు మారుతినాయుడు, మనోహర్, పోతుల మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ముగిసిన రాష్ట్రస్థాయి 43వ మా అథ్లెటిక్స్ 2024-25 పోటీలు

## - ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న అనంత జిల్లా




ఛాంపియన్ షిప్ కైవసం చేసుకున్న అనంత జిల్లా క్రీడాకారులు, ఇతరులు

అనంతపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురం నగరంలోని పిటిసి మైదానంలో మూడు రోజులుగా జరిగిన 43వ మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలు 2024-25 ఎంఎఎ డిస్టిక్ ప్రెసిడెంట్ సుధాకర్ బాబు కోమల పాటి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ క్రీడా పోటీలు మాస్టర్ అథ్లెటిక్స్ ఇండియా 43 వారి క్షోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మీట్ ఈవెంట్‌ను అనంతపురం నగరంలో పిటిసి స్టేడియం గ్రౌండ్‌లో అంగరంగ వైభవ ంగా నిర్వహించడం జరిగిందని, 30 సంవత్సరాల నుంచి 100 వరకు ఉన్న పురుషులు, మహిళలకు నిర్వహించిన ఈ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్ సర్టిఫికెట్స్ ట్రోఫీలను అందజేయడం జరిగిందని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన 300, 400 మీటర్స్ 3కె రన్, 5కె రన్, జావలిన్ త్రోషార్ట్‌పుట్, డిస్క్‌త్రో, క్రీడల్లో ఓవరాల్ ట్రోఫీ మొదటి స్థానం అనంతపురం, రెండో స్థానం కర్నూలు, మూడవ స్థానం, నాలగ్వ స్తానాలు గుంటూరు, నెల్లూరు స్థానాల్లో విజేతలుగా గెలుపొందారు. ఈ ట్రోఫీలను మా అథ్లెటిక్స్ అసోషి యేషన్ చైర్మన్, స్టేట్ సెక్రెటరీ సైకం రాంప్రసాద్, జిల్లా అధ్యక్షులు సుధాకర్ బాబు, జిల్లా సెక్రెటరీ సికిందర్, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రర్ సుధాకర్‌బాబు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్, గొర్తి కృష్ణయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అలాగే మూడు రోజుల నుంచి నిర్విరామంగా జరిగిన పోటీలలో రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు చాలా ఉత్సాహంగా పాల్గొని పోటీలలో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మీనాక్షమ్మ ఫౌండేషన్ రవికాంత్ రమణకి అర్బన్ బ్యాంక్ చైర్మన్ మురళీధర్‌కి, డాక్టర్ కొండయ్యకి, బల్ల గ్రూప్ అధినేత బల్ల సురేష్‌కి, కొమ్మినేని శ్రీనివాసులునాయుడు, యల్‌జయరాంనాయుడుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

# గత ఆరు నెలల్లో అనేక షోరూమ్స్ నగరానికి రావడం శుభపరిణామం

## - ఇక్కడ వ్యాపారులకు పూర్తి స్వేచ్ఛా, సహకారం ఉంటుందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

## - అంజంతా షూ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దగ్గుపాటి




అంజంతా షూ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రానికి అనేక పెట్టుబడులు రావడమే కాకుండా అనంతపురం నగరం వంటి ప్రాంతాల్లో కూడా వ్యాపార సంస్థలు ప్రారంభమవుతున్నాయని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని సుభాష్‌రోడ్‌లో చెన్నైకి చెందిన అజంతా షూ హౌస్‌ను, ఆ సంస్థ ఎండి రమేష్, డైరెక్టర్ గోపి కృష్ణ, వైస్ ప్రెసిడెంట్ సత్యప్రకాష్, శ్రీపాద వేణులతోపాటు ప్రారంభించారు. నగరంలోని పలువురు ప్రముఖులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. చెన్నైకి చెందిన అజంతా కంపెనీ వారు నగరంలో 10వ షోరూమ్ ఏర్పాటు చేయడంచాలా సంతోషంగా ఉంద న్నారు. ఇక్కడ వ్యాపారాలు చేసుకునే వారికి పూర్తి స్వేచ్ఛా, సహకారం మా వైపు నుంచి ఉంటుందన్నారు. గత ఆరు నెలల్లో వ్యాపారాలు చేసే వారికి ఒక నమ్మకం ఏర్పడిందని అందుకే నగరంలో పెద్ద ఎత్తున షోరూమ్స్ ప్రారం భిస్తున్నారని అన్నారు. అనంతపురం జిల్లా కరువు ప్రాంతమని, అయితే ఇక్కడ విద్యా సంస్థలకు, విద్యా వంతులకు లోటు లేదన్నారు. కానీ నిరు ద్యోగ సమస్య కూడా ఎక్కువగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ వ్యాపారాలు ప్రారంభించే వారు స్థానికులకే ఉద్యోగ ఉపాధి అవకా శాలు కల్పించాలని సూచించారు. నగరంలో ఎవరైనా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవ చ్చని, మా వైపు నుంచి పూర్తి స్థాయిలో సహకారం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

## - ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

అనంతపురం కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ వివరాలతో పాటు సమస్యలకు సంబంధించి అర్జీలను అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఈనెల 10న పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి - డిఇఓ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఈ నెల 10వ తేదిన జరిగే పరీక్ష పే చర్చ 2025లో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో చేపట్టిన సంభాషణ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని అందరూ వీక్షించాలని, ఈ దిశగా పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని ఆర్జెడి, జిల్లా విద్యాశాఖాధికారులు, డైట్ ప్రిన్సిపాళ్లకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయరామరాజు, ఐఏఎస్, డైరెక్టర్, ఎస్సీ ఈఆర్టి ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# పిఆర్‌టియు-ఎపి ఆవిర్భావ దినోత్సవం




మాట్లాడుతున్న పిఆర్‌టియు నాయకులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

పిఆర్‌టియు-ఎపి ఆవిర్భావ దినోత్సవంను ఆదివారం నగరంలో హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ సత్య నిలయంలో జిల్లా అధ్యక్షులు టి.పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిమ్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డా.ఎ.కేశవరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి శివారెడ్డి, జిల్లా నాయకులు బి.వేమరెడ్డి, బి.లక్ష్మిప్రసాద్‌రెడ్డి, పి.జయప్రకాష్, బి.శ్రీనివాసులు, కె.వెంకటరమణరెడ్డి, సి.అశ్వర్థరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. దాదాపు 53 సంవత్సరాల నుంచి సంఘ నిర్మాణ ప్రక్రియను వివరిస్తూ, అందుకు పాటుపడిన ముఖ్యులను స్మరించుకోవడం జరిగింది.

# ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్.

తనకల్లు, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త:

తనకల్లు మండల కేంద్రంలోని ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ఆదివారం మండ్లిపల్లి మిట్టమీద ఉన్న ఎస్ఎమ్ఆన్ ఫంక్షన్ హాల్ నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తనకల్లు మండల ముస్లిం మైనార్టీ ఇమామ్‌లు, మౌజన్లు, శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్‌కి పూలమాలలతో దుశ్యాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కదిరి నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు నా గెలుపుకోసం కృషి పట్టు దలతో పనిచేసే అసెంబ్లీకి పంపించారని, వారికి ఎప్పుడూ రుణపడి ఉంటా రని, అంతేకా కుండా ఇమాములకు, మౌజన్లకు ఇల్లు నిర్మించి వారిని ఒక ఉన్నతమైన స్థాయిలో పెడతానని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా స్థానిక ముస్లిం మైనార్టీలు, ఎమ్మెల్యే అర్జీల రూపంలో సమస్యలను తెలిపా రు. ఆయన స్పందిస్తూ, తనకల్లు మండల కేంద్రంలోని స్మశాన వాటికకు చుట్టూ ప్రహరీ గోడ కూడా నిర్మిస్తానని, వీలైనంత తొందరగా నిరుపేద మైనార్టీల వివాహాలు మరియు వేడుకల కొరకు ప్రతి మండలానికి ఒక షాదీ మహల్ కట్టిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తొట్టి రెడ్డి, శేఖర్ రెడ్డి, కొర్తికోట మాజీ సర్పంచ్ మస్తాన్, తెదేపా నాయ కులు కావడి ప్రవీణ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, సోంపాలెం నాగభూ షణ, పీజీ మల్లికార్జున, మాజీ సర్పంచ్ గోవిందు, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, హిదాయతుల్లా, దస్తగిరి, జియాఉల్లా, మహిళలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వైకాపా నుండి బిజెపిలో చేరిక




వైకాపా నుండి బిజెపిలోకి చేరిన పూల కుంట అక్కులప్ప

బుక్కరాయసముద్రం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం గ్రామా నికి చెందిన మాజీ గ్రామ సర్పం చ పూలకుంట అక్కులప్ప, లింగమ్మ,తిలక్ వారి బృందం భారతీయ జనతా పార్టీలో ఆది వారం బిజెపి జిల్లా అధ్యక్ష లు కొనకొండ్ల రాజేష్,సీనియర్ నాయకులు చిరంజీవిరెడ్డి, రత్న మయ్య,బిజెపి జిల్లా ప్రధానకా ర్యదర్శి అశోక్‌రెడ్డి,మండల అధ్యక్షులు చంద్ర మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరడం జరిగిందన్నారు.ఈ సందర్భంగ బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ మ్టాడుతూ బిజెపి నరేంద్రమోడీ నాయకత్వంలో దేశఅభి వృద్ధి దినదినము జరుగుతోందని భారతదేశాన్ని విశ్వగురువుగా చూడబోతామని మధ్యతరగతి కుటుంబానికి చెందినటువంటి వారు రాజకీయాల మీద ఉన్నటువంటి వ్యక్తులు బిజెపిలో క్రమశిక్షణతో పనిచేస్తారన్నారు.

# ఆదర్శ పాఠశాల(మోడల్ ప్రైమరీ) ఏర్పాటు ముసుగులో వేలాది పాఠశాలలను అనాధ పాఠశాలలుగా మార్చటాన్ని వ్యతిరేకిస్తాం - ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు




మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1938) అనంతపురం జిల్లా స్థాయి ఉద్యమ శిక్షణా తరగతులు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయ రాజు, ఐఫియా చీఫ్ ప్యాట్రస్ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ 117 రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలకు, పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోడల్‌ప్రైమరీ (ఆ దర్శ ప్రాథమిక పాఠశాల)ల ఏర్పాటు పేరుతో వేలాది ప్రాథమిక, ప్రాథమి కోన్నత పాఠశాలలను నిర్వీర్యపరచడం లేదా మూసి వేయడం ద్వారా మరొక్కసారి ప్రభుత్వ విద్యా రంగాన్ని విచ్చిన్నం చేసే దిశగా అడుగులేస్తుందని, దీనిని ఏపిటిఎఫ్‌గా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కొన్ని ఆదర్శ పాఠశాలలు కొన్ని అనాధ పాఠశాలలు అనే ఆలోచనను ప్రభుత్వ విరమించు కోకపోతే ప్రభుత్వ బడుల మూసివేతను అడ్డుకుంటామ ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఫియా చీఫ్ ప్యాట్రస్ సుబ్బారెడ్డి, పిటిఎల్ ఎఫ్ రాష్ట్ర అధ్య క్షులు ప్రసన్న, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి రఫీ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, రవీంద్ర, సత్యప్ర సాద్, పోతుల య్య, ఆంజినేయులు నాయ క్, అశోక్ నాయక్‌తో పాటు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రగతిశీల దళిత గిరిజన సమైక్య - పిడిజిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన పిడిజిఎస్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

నగరంలో ఆదివారం ప్రగతిశీల దళిత గిరిజన సమైక్య (పిడిజిఎస్) నాయకురాలు ప్రతిభా భారతి అధ్యక్షతన జిల్లా స్థాయి ముఖ్య నాయకుల నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పిడిజిఎస్ రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నాగన్న హాజరు కావడం జరిగింది. దళితులు, గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై అలాగే దళిత గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 319 ప్రకారం కుటుంబానికి రెండున్నర ఎకరాల చొప్పున భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్ప్లై నిధులు, ఎస్సీలు కందేలా, అలాగే ఎస్సీలపైన జరిగే దాడులను అరికట్టాలని, దళిత గిరిజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పోరాడుతామని, దళిత గిరిజనులను ఆదుకోవ డంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని, రాబోయే రోజుల్లో దళిత గిరిజన మహిళ సమస్యల పరిష్కారం కోసం ప్రగతిశీల దళిత గిరిజన సమైక్య పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడ తామని తెలియజేశారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కార్యదర్శిగా సాకే ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడిగా శేషు, ఉపాధ్యక్షులుగా రోషణ, సహాయ కార్యదర్శిగా అంజి, కోశాధికారిగా సూరి, కమిటీ సభ్యులుగా ప్రతిభ భారతి, లక్ష్మన్న, నాగన్న, లోకేష్, గంగన్న, నాగేంద్రబాబు, మధు, శ్రీరాములు, సుబ్బన్న, వీరిని సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది.

# వెంగమనాయుడు కాలనీలో 20 తులాల బంగారు అభరణాలను అపహరణ

## - పోలీసులు గస్తీని ముమ్మరం చేయాలంటున్న ప్రజలు




గుర్తుతెలియని వ్యక్తులు తాళాలను ధ్వంసం చేసి లోపలికి చొరబడి చేసిన వీరంగంతో చెల్లాచెదురుగా పడున్న దుస్తులు

పామిడి, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త

స్థానిక వెంగమనాయుడు కాలనీలోని ఓ ఇంటి తాళాలను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు బీరువాను పగులగొట్టి 20 తులాల బంగారు ఆభరణాలను అపహరించిన సంఘటన ఆదివారం వేకువజా మున చోటుచేసుకుంది. బాధితుడు శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాలివావున్నాయి. పట్టణంలో ఫోటోస్టూడియో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్ననే వెంగ మనాయుడు కాలనీలో నివాసం ఉంటున్నానని తెలి పారు. కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఇంటికి తాళం వేసి కసాపు రంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్ళి రాత్రి అక్కడే బస చేసి తిరిగి ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళాన్ని ధ్వంసం చేసినట్లు గుర్తించి లోపలికి వెళ్ళగా బీరువాలోని దుస్తులు వస్తువులు చెల్లాచెదురుగా పడివుండటంతో పాటు 20 తులాల బంగారు ఆభరణాలు కనిపించక పోవటంతో చోరీకి గురైనట్లు పోలీసులకు తెలియజేయటం జరిగిందన్నారు. దీంతో సంఘటనా స్థలాన్ని పరి శీలించిన పోలీసులు బాధితుడు శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. ఇళ్ళకు తాళాలు వేశామంటే లూటీ తప్పదన్న అభద్రతాభావం నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్ప టికైనా పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేసి చోరీలకు పాల్పడుతున్న గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షిస్తూనే భవి ష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఎంతైనావుందని పలువరు కోరుతున్నారు.

# కేశ ఖండన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం



ముంతా కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ముంతా నారాయణ కుమారుడు కేశ ఖండన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. ఆదివారం ఎరగుంటపల్లి పొలిమెర పెద్దమ్మ దేవాలయంలో జరిగిన కేశఖండన కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట టిడిపి నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, ఆకుల బాబు, జిసిబాబు, చిన్న ఆంజినేయులు, బ్యాళ్ల సుదర్శన్, గుర్రం లక్ష్మినారాయణ, ముంతా వెంకటేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# బోయ వెంకటేష్‌ను పరామర్శించిన వైసీపీ నేతలు

## అండగా ఉంటామంటూ రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

పామిడి, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త

పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులు కుమారుడు బోయ వెంకటేష్ ప్ర మాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిన విష యం తెలుసుకున్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అల్లుడు యువనాయకులు మంజూనాథ్‌రెడ్డి, వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్య దర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆదివారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు ఆందోళన చెందవద్దని అండగా ఉంటూ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తూ వారి అభ్యున్నతికి పాటు పడుతామని తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పామిడి సూరి, నాయ రామచంద్ర, సుధాకర్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అక్షేమియా సాహెబ్ గందోత్సవం



అల్లా బకాష్ నివాసంలో గంధం (పూజ) సందర్భంగా జల్సా నిర్వహిస్తున్న పకీర్లు



అల్లా బకాష్ నివాసం నుంచి దర్గాకు గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతి, పక్కీర్లు, అల్లా బకాస్ కుటుంబ సభ్యులు

కదిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఒడి చెరువు మండలంలోని చింతమానుపల్లి పంచాయితీ అచ్చేమియా పల్లిలో వెలసిన హజరత్ ఖాజా సయ్యద్‌షా అబుల్ హసన్ చిష్తి ర.అ ఉరఫ్ అచ్చేమియా సాహెబ్ వారి 433వ గంధం ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. టిడిపి మైనార్టీ రాష్ట్ర ఉర్దు అకాడమి డైరెక్టర్ జౌలి అల్లాబకాష్ ఇంటి నుంచి స్వామివారి గంధంను పక్కీర్ల జల్సాలతో భారీ ఊరేగింపుతో దర్గాకు గంధంను తీసుకెళ్లారు. గంధం వేడుకల సందర్భంగా అల్లాబకాస్ నివాసంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. గంధం వేడుకల్లో పీఠాధిపతి మహ బూబ్ హాసన్ సంజారి ఆధ్వర్యంలో వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఇస్మాయిల్, డి.అబ్దుల్ రవూఫ్, మాజీ కోఆప్షన్ మెంబర్ నిజాం, జౌలి బాబాఫకృద్దీన్, లక్ష్మినారాయణరెడ్డి, సురేష్, సుధాకర్‌రెడ్డి, బూదిలి ఓబుల్‌రెడ్డి, ముస్లిం మైనార్టీలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీఅశ్వత్థనారాయణస్వామిని దర్శించుకున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



పోలీసులతో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



దుకాణదారులతో మాట్లాడుతున్న జె.సి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

పెద్దపప్పూరు మండలం చి న్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన అశ్వత్థంలో వెలసిన శ్రీఅశ్వత్థనారాయణ స్వామి, శ్రీచక్రభీమలింగే శ్వర స్వామిని తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ద ర్శించుకున్నారు. మాఘమాసం రెండవ ఆదివారం సంద ర్భం గా ఆయన స్వామివారిని దర్శి ంచుకున్నారు.

అనంతరం భక్తుల ఏర్పాట్లను పరిశీలించా రు. తిరుణాల సందర్భంగా భ క్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని పోలీసులకు తెలి యచేశారు. అలాగే అంగళ్లను ఎక్కడపడితే అక్కడ పెట్టరాదని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.

# బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకో

## - వాసాపురం బాబుపై మండిపడ్డ యల్లనూరు టిడిపి నాయకులు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

యల్లనూరు మండలం వాసాపురం గ్రామానికి చెందిన బాబు బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతు న్నారని వాసాపురం గ్రామానికి చెందిన పాపారాయుడు, బొప్పేపల్లి రవికుమార్‌రెడ్డిలు మండిపడ్డారు. ఆదివారం తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ కోసం మేము కూడా కష్టపడ్డామని తమ కష్టాన్ని గుర్తించిన శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సమన్యాయం చేస్తూ ఒకరికి ఫీల్డ్ అసిస్టెంట్ మరొకరికి స్టోర్ డీలర్ అప్పగించారని ఎమ్మెల్యే నిర్ణయాన్ని దిక్కరిస్తూ పార్టీకి రాజీనామా చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెర లేపారని వాపోయారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. గతం లో కూడా పలుమార్లు రాజీనామా చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు. గ్రామాల్లో సమస్యలు జరిగితే సామరస్యంగా కూర్చుని మాట్లాడుకో వాలి కానీ రాజీనామా చేస్తా అంటూ ఎమ్మెల్యేని సైతం బెదిరింపు దోరణితో వ్యవ హరించడం సరికాదన్నారు. తమకు న్యాయం జరగకపోతే మే ము కూడా రాజీనామా చేసేం దుకు సిద్ధంగా వున్నామని వాసాపురం టిడిపి నాయకులు పాపారాయుడు, బొప్పేపల్లి రవికుమార్‌రెడ్డి, తిమ్మంపల్లి మహేశ్వర్‌రెడ్డి, కొడవండ్లపల్లి జయరామకృష్ణ, యల్లనూరు మండల నాయకులు అన్నారు.